# ఖదీర్ చెప్పిన కథలు





సెప్టెంబరు నెల రాత్రి.

సుందరం టి.వి. చూస్తున్నాడు. నూట ఇరవై ఛానల్స్. ఒకదాని తరువాత ఒకటి తిప్పుతూ, దిగులుగా, అసహనంగా, పూర్ణ బెడ్‌రూమ్‌లో, ఆవేల్టి న్యూస్ పేపరును శ్రద్ధగా చదువుతూ, పూర్ణ పక్కన ఎఫ్.ఎమ్. రేడియో, అంతగా శ్రావ్యత లేని పాటలు పాడుతుంది.

పూర్ణకు నెలలు నిండాయి. ఇవాళో రేపో డెలివరీ కావల్సి ఉంది.

"నేనొకసారి ఖదీర్ దగ్గరకు వెళ్ళొస్తాను," అన్నాడు సుందరం, టి.వి. స్విచ్ ఆఫ్ చేస్తూ, ముఖం పైని అసహనాన్ని చెరిపి వేసుకొని, దిగులును మాత్రం అట్లాగే ఉంచుకొని.

"ఊ," అంది పూర్ణ ముఖం పైని పేపరు పక్కకు జరిపి.

"కానీ ఇంత వానలో ఎందుకు," అంది. బయట వర్షం. మూడురోజులుగా కురుస్తూనే ఉంది. అంత వానలో పూర్ణకు నొప్పులు వస్తే, అనే ఊహ, కంగారుగా ఉంది సుందరానికి.

"మూడ్ బాగోలేదు. టెన్షన్‌గా, భయంగా ఉంది," అన్నాడు.

రెయిన్‌కోటు నిండా కప్పుకొని, గొడుగు కూడా పట్టుకొని వర్షంలోకి అడుగుపెట్టాడు సుందరం. నడుముపై చేతులు ఆధారంగా పెట్టుకొని పైకి లేచింది పూర్ణ. తలుపులు వేస్తూ, "ఖదీర్‌భాయ్‌కి సలాం చెప్పు. నా గురించి ఒక కథ రాస్తానన్నాడు. అది గుర్తుచెయ్యి," అంది.

బయట రోడ్ల నిండా నీళ్ళు. నీళ్లను చీల్చుకొని, ఆటోలు, కార్లు ప్రయాణిస్తున్నాయి. "ఆకాశం నిర్లిప్తంగా ఉంది. ఎవరి దుఃఖాన్నో ప్రపంచానికి బదిలీ చేస్తున్నట్లుగా ఉందీ వాన," అనుకున్నాడు

సుందరం. నిజానికి బయట వాన అద్భుతంగా ఉంది. వానజల్లుల మీదుగా వీస్తున్న గాలి, మనోహరంగా ఉంది. మధురమైన ఎప్పటిదో జ్ఞాపకంలా శరీరాన్ని తాకుతుంది. కానీ వానంటే, ఒక విసుగు, ఒక తప్పనిసరి సఫరింగ్, అని నిర్ణయించుకొన్న సుందరానికి, వాన ఆగంతకుని పలకరింపులానే ఉంది. వాన వస్తూనే, వీధుల్లోకి పరిగెత్తి శరీరాన్ని వానలో మొలకెత్తనిచ్చి, రోడ్డుపై ప్రవహించే నీళ్లలో కత్తెర పడవల్ని ప్రయాణింపజేసే సుందరం, ఇప్పుడు లేడు. ఈ సుందరాన్ని బార్, రెండు మూడు పెగ్గుల విస్కీ తప్ప, మరేదీ ఉత్సాహపరచటం లేదు. సుందరానికిప్పుడో బార్ కావాలి, ఒక ఖదీర్ కావాలి.

సుందరం ఫుట్‌పాత్‌పై వేగంగా నడుస్తున్నాడు. అతని పక్క నుంచి ఆటో ఒకటి వేగంగా వెళ్ళిపోయింది. నీళ్ళు చింది సుందరం శరీరం పై పడ్డాయి. ఆటోలో కూర్చున్నవాళ్ళు పెద్దగా పోట్లాడుకుంటు న్నారు. భీకరమైన తిట్లను గాలిలోకి విసురుతున్నారు. 'కొవ్వుపట్టింది', 'నరికేస్తాను', 'పందిముఖందానా' లాంటి మాటలు సుందరం ముఖం పై ఫెడేల్మని తగిలాయి.

పుట్టబోయే బిడ్డ గురించి ఆలోచిస్తున్నాడు సుందరం. అంద మైన ముఖం, చిట్టిచిట్టి చేతులు, పిల్లలు గొప్ప ఆశ్చర్యం అను కున్నాడు. పిల్లలు మరో లోకపు అతిథులు అనుకున్నాడు. శిశువు చిత్రపటం కళ్ళలో మెదలగానే, డెలివరీ గురించి ఆందోళన మొద లైంది సుందరానికి. ఇవాళనీ, రేపునీ, అసలు ఈ వారాన్నే వెళ్ళిపో నిచ్చి, వచ్చే వారం డెలివరీ అయితే బాగుండు అనుకున్నా, వచ్చేవారం అయితే కాస్త డబ్బు సర్దుతానంది పూర్ణ పనిచేసే షాపు ఓనరు. వారం వరకూ టెన్షన్ అవసరం లేదని సర్ది చెప్పుకున్నాడు. వచ్చే వారం ఈ ప్రపంచానికో అతిథి రాబోతున్నాడు. ప్రపంచానికెవరో రంగుల తోరణాలు కడతారు. శిశువుని రెండు చేతుల మధ్య పొదువుకొని, పైకి ఎత్తి, ఆకాశం వైపు చూపిస్తూ, ''ఇదుగో ఒక అద్భుతం, భగ





వంతుడు మళ్ళీ పుట్టాడ,''ని ప్రకటించి, సుందరం మధురమైన ఊహతో పులకించిపోయాడు.

ఖదీర్ లేడు. అపార్టుమెంటు తాళం వేసి ఉంది. తలుపుపై ఒక కాగితం అతికించి ఉంది. ''సుందరం భాయ్, గుల్దస్తా బార్‌కి రా. శివుడు ఉన్నాడు. కవితల ముషాయిరా ఉంది. ఓల్డ్‌మాంక్ రమ్ సిద్ధంగా ఉంది. వానను చీల్చుకొని ఇటు వచ్చెయ్.''

వాన కురుస్తూనే ఉంది. గుల్దస్తా బార్ దగ్గరకు వచ్చినాక, సుందరానికి వాన మనోహరంగా ఉందనిపించింది. పూలతోటల మధ్య నడుస్తున్నట్లుంది. బార్‌లోని విస్కీ పరిమళాలు అతన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

బార్‌లో, ఒక మూలన అద్దాల కిటికీ పక్కన, బల్ల చుట్టూ పదిమంది పైగా కవులూ, రచయితలూ, జర్నలిస్టులు, మధ్యలో శాలువా కప్పుకున్న అరవై యేళ్ళ మనిషి. బౌద్ధభిక్షువులా, 'శివుడు' అంటూ పరిచయం చేశాడు ఖదీర్. ''నా ఫ్రెండ్ నా కథల హీరో. మోహనసుందరం,'' అంటూ సుందరాన్ని పరిచయం చేశాడు. వాళ్ళం దరూ సుందరాన్ని ప్రేమగా ఆలింగం చేసుకున్నారు. సుందరం కోసం 'ఓల్డ్‌మాంక్' సిద్ధం చెయ్యబడింది. శివుడి కవితా పఠనం మొదలైంది. వానలో వెచ్చని మంటలా తోచింది సుందరానికి.

కొత్తగా- గమ్మత్తుగా ఉందీ అనుభవం సుందరానికి. బార్ నిండా సిగరెట్ పొగ. అరుపులూ, కేకలూ; ఆ మూలనెవరో తీవ్రంగా వాదించు కుంటున్నారు, నైతిక విలువల గురించి. కుక్కతో సహా బార్‌లోకి వచ్చాడో ఆర్మీ ఆఫీసరు. కుక్క అతని చేతుల్ని విడిపించు కొని, అన్ని టేబుల్స్ చుట్టూ తిరుగుతుంది. ఎవడో సెల్‌ఫోన్‌లో పల్లెటూళ్ళో తల్లికి, 'అంతా ఓకే,' అని అబద్ధాలు చెబుతున్నాడు. భుజాలపై లాప్‌టాప్‌లతో సహా సాఫ్ట్‌వేర్ సమూహం బార్‌లోకి అడుగు

పెట్టింది. "ఇది గుల్దస్తా, ఇది పార్టీ టైమ్," అంటూ ఖదీర్ పెద్దగా అరిచాడు.

హఠాత్తుగా శివుడు, "ఖదీర్, ఒక కథ చెప్పు. ఒక అమ్మాయి, అబ్బాయి, లేదా మొగుడూ పెళ్ళాము. ఒక దృశ్యం దగ్గర మొదలు పెట్టుకొని, వాళ్ళ జీవితాల్లోకి వెళ్ళు. ప్రిన్స్ ఆఫ్ షార్ట్ స్టోరీనంటావుగా, ఒక కథ వదులు," అన్నాడు.

ఖదీర్ క్షణంసేపు ఆశ్చర్యంగా చూశాడు. తరువాత గంభీరంగా మారాడు. కాసేపు జుట్టులో వేళ్ళు జొనిపి, తలను అటూ ఇటూ కదిలించి, "సరే సార్, కథను వదులుతున్నాను కాసుకోండి," అన్నాడు. సుందరం ఎగ్జైటింగ్‌గా చూస్తున్నాడు.

***రెండు ముఖాల జీవితం***

మినర్వా కాఫీహౌస్. వాళ్ళిద్దరూ మౌనంగా. ఎదురుగా రెండు కాఫీ కప్పులు. బహుశా ఆ కాఫీ చల్లారిపోయి, ఉత్తేజపరిచే తన లక్షణాన్ని కోల్పోయి.

అతను కిటికీలోంచి బయటకు చూస్తున్నాడు. పేవ్‌మెంటుపై గుంపులు గుంపులుగా, ఒకళ్ళనొకళ్ళు తోసుకుంటూ, ఎవరూ ఎవరికి ఏమీ కానట్లు, తమ పనే ముఖ్యమైనట్లు వేగంగా పరుగుపందెంలో లాగా నడుస్తూ, 'మనిషి ఎప్పుడూ ఒంటరి జీవే,' అని అనుకున్నాడు గాఢంగా నిట్టూరుస్తూ.

అతను ఏదయినా మాట్లాడితే బాగుండు అనుకుంది పూర్ణ మాణిక్యం.

"ఊఁ," అని గాఢంగా నిట్టూర్చి ఎదురుగా ఉన్న కాఫీ కప్పు వైపు దీర్ఘంగా చూడటం మొదలుపెట్టాడు అతను. సత్యసుందరం. ముందుకు వంగి రొమాంటిక్‌గా, ఆమె చేతిని, తన చేతిలోకి తీసుకొని, 'సంగతులేమిటి?' అని అడుగుదాం అనుకున్నాడు.





పూర్ణమాణిక్యం చూపులు కిందకు, టేబుల్ కిందకు దిగి, తన పాదాల వైపు, తిరిగి ఉన్నాయి. 'ఈ కాఫీహౌస్ ప్రహసనం లేకపోతే, ఈపాటికి ఇంటికి వెళ్లి కుక్కర్‌లో కాస్త రైస్ వేసి, టి.వి. ముందు కూర్చుని, కూరగాయలు తరుక్కుంటూ, కొత్త బంగారాన్ని చూస్తూ ఉండేదాన్ని,' అనుకుంది. 'ఆఫీసుకు ఫోన్ చేసి, సాయంకాలం మినర్వాకి వెళదాం,' అంటూ, తీరా ఇక్కడికొచ్చినాక, మౌనంగా, బిగుసుకుపోయి, 'ఏమిటీ ఖర్మ,' అనుకొంది పూర్ణమాణిక్యం.

పూర్ణకు చాలా ఆకలిగా ఉంది. ఏదైనా తినాలని ఉంది. సుందరం కాఫీ మాత్రమే ఆర్డర్ చేశాడు. ఎదురుగా ఉన్న కాఫీకప్పు, ఆమె ఆకలిని వెక్కిరిస్తున్నట్లుగా ఉంది.

సుందరం పెదాల చాటు నుంచి, ఏవో మాటలు. తనలో తాను గొణుక్కుంటున్నట్లు. ఏదో చెప్పాలని ప్రయత్నం. కానీ ఎవరో వెనక నుంచి లాగుతున్నట్లు మళ్లీ ఒకసారి గాఢంగా నిట్టూర్చాడు. వెయిటర్ రెండోసారి వాళ్ళ దగ్గరకు వచ్చాడు. వాళ్ళ ఖాళీ ముఖాలు చూసి వెనక్కు తిరిగాడు.

మధ్యాహ్నం, పూర్ణ టి.వి.లో కనబడింది. విదేశీ మొగుడు మోసానికి బలై, ఆత్మహత్యకు పూనుకున్న అమ్మాయి తరఫున, పోలీసుస్టేషన్ ముందు ధర్నా చేసి, డిఎస్పీని ఘెరావ్ చేసి, పోలీసులతో దెబ్బలు తింటూ, రోడ్డుపై ఈడ్చబడుతూ. 'మీ మిసెస్ కదా,' అంటూ కొలీగ్స్ సుందరం వైపు జాలిగా చూశారు. "డిగ్రీ చేసిన అమ్మాయి, ఈ ఎన్‌జీవోలను పట్టుకొని తిరగడమెందుకు?" అని క్లాస్ తీశారు.

ఇవన్నీ ఇక మానేయమని గట్టిగా చెప్పాలనుకున్నాడు సుందరం. చాలా ప్రిపేర్ అయ్యాడు. అక్కడక్కడా చదివిన పుస్తకాల్లోని మాటలు కూడగట్టుకొని, ఆమెకు కౌన్సిలింగ్ ఇవ్వాలనుకున్నాడు. ఇంట్లోవాళ్ళను కాదని, ఆమెని పెళ్ళి చేసుకొన్న విషయం

గుర్తు చెయ్యాలనుకున్నాడు. (ఆ మేరకు ఆమె తనకు రుణపడి ఉందని చెప్పాలని అతని ఉద్దేశం.) కానీ మాటలు పెగలటం లేదు.

అతనింక వెళ్ళిపోతే బాగుండు, అని చూస్తుంది పూర్ణ. అతను వెళ్ళిపోతే తనకిష్టమైనవన్నీ ఆర్డర్ చేసుకొని, తినాలని ఆమె కోరిక. ముందుగా మైసూరుబజ్జీ, తరువాత ఊతప్పం, చివరిగా ఏదైనా స్వీటు. తిండిపోతు అనుకున్నా పర్లేదు.

సుందరం గొంతు విప్పాడు. నాలుగైదుసార్లు గొంతు సవరించుకొని, అయితే సుందరం మాట్లాడింది, తన స్కూలు గురించి, హెడ్‌మాస్టర్‌తో తన గొడవల గురించి.

పూర్ణ, సుందరం వైపు చూస్తుంది. ఇది స్కూలు ముఖం. స్కూలుకు వెళ్ళే ముందు, సుందరం పెట్టే ముఖం. నున్నగా తోమిన స్టీలుబిందెలాంటి ముఖం. సాయంకాలం ఇంటికి వచ్చేసరికి వేరే ముఖం తయారవుతుంది. మసకబారిన చంద్రుడి ముఖం. రాత్రి బెడ్‌రూమ్‌లో మరో ముఖం. వెలిగిపోయే చంద్రుడి ముఖం. ఉదయం, కాఫీ కాఫీ అని అరచే ఎంసిపి ముఖం. పూర్ణకు నవ్వు వచ్చింది. అతని ముఖాలన్నీ, మాస్కుల్లా ఆమె కళ్ళ ముందు తళుక్కుమన్నాయి.

''ఏం ఆలోచిస్తున్నావు,'' అన్నాడు సుందరం.

''నీ గురించే. నువ్వు ఎంత కృతకంగా, సందర్భాల్ని బట్టి ముఖాల్ని మారుస్తావో, గుర్తుకొచ్చింది,'' అంది. సుందరం ముఖం ఎర్రబడింది. కళ్ళలో ఎరుపు. ముక్కుపుటాలు అదిరాయి. కోపంగా లేచి నిలబడ్డాడు వెళ్ళిపోవడానికి.

'గాడ్, తను వెళ్ళిపోతున్నాడు. ఇక ఇది నా అడ్డా, ముందు అర్జంటుగా టిఫిన్ ఆర్డర్ చెయ్యాలి. సన్నగా ఈల వేసుకుంటూ, సెల్ ఫోనులో పాటలు వింటూ, టిఫిన్ లాగించాలి,' అనుకుంది పూర్ణ. 'గాలి అలలా, సెలయేటి నీటిలా, స్వేచ్ఛగా, నిజంగా, ఇలాగే,' ఏదో పుస్తకంలో చదివిన మాటల్ని గొణుక్కుంది. సుందరం రెండు





అడుగులు బయటకు వేసి, మళ్ళీ రాజీపడ్డ వాడిలా వెనక్కు వచ్చి, కుర్చీలో కూర్చుని, "నువ్వు మారవు, రాక్షసివి," అంటూ బల్లపై కోపంగా గుద్దాడు.

పూర్ణ ఎదురుగా నాలుగైదు ప్లేట్లు. బజ్జీ, ఊతప్పం, స్వీటు. కనురెప్పల్ని మూసి, మౌనంగా ధ్యానముద్రలో ఉన్నట్లుగా తినడం అనే ఒక యోగ ప్రక్రియకు సిద్ధమవుతున్నట్లుగా, బయట చీకటిరంగు కర్టెన్లు. అన్నివైపులా అప్పుడే వెలిగిన స్ట్రీట్‌లైట్ల వెండిరంగు. సుందరం నిర్లిప్తంగా, ఓటమి అంగీకరించిన ప్రతినాయకుడిలా కూర్చున్నాడు.

పూర్ణ చెవుల దగ్గర హఠాత్తుగా, ఏవో చప్పుళ్ళు. తీవ్రమైన ఉచ్ఛ్వాస, నిశ్వాసలు. అడుగుల చప్పుళ్ళు. రొప్పుతూ, అరుస్తూ ఎక్కడో విన్న గొంతు. పూర్ణలో చిన్న జలదరింత, అవాంఛితమేదో ఎదురు కానున్నట్లు.

ఇద్దరు వృద్ధ దంపతులు, డెబ్బై యేళ్ళకు పైనే వయసు. విసురుగా లోపలికి వచ్చారు. దాడి చెయ్యడానికి వచ్చినట్లు, ఆగ్రహంతో పూర్ణ టేబుల్ దగ్గరకు వచ్చారు. పూర్ణ ముందున్న ప్లేట్లను ఎత్తి నేలపై విసిరికొట్టింది, ముసలమ్మ. పూర్ణ కుర్చీని లాగి, పూర్ణ ముఖంపై, ఎడాపెడా వాయించి, జుట్టు పట్టుకొని లాగి, ముసలమ్మ ముఖం ఎర్రబడింది. శరీరమంతా వణికిపోతుంది. పూర్ణ ఆశ్చర్యంతో, విస్మయంతో చూస్తుంది. రహస్యాన్ని బయటకు తీసినట్లుగా ముసలాయన పాంటుజేబులోంచి కత్తి బయటకు తీశాడు. సుందరం లేచి, "ఏయ్, ఎవరు మీరు?" అని అరిచేలోపు, ముసలాయన కత్తితో పూర్ణపై దాడి చేశాడు. పూర్ణ తన బలమైన చేతులతో, ఆయనను నిలవరించి, ఆయన్ను పక్కకు తోసింది. ఆ విసురులో కత్తి ముసలమ్మకు తగిలి, ఆమె భుజం చీరుకుపోయింది. ఎర్రటి రక్తం, బుసబుసమంటూ పొంగింది. చుట్టూ జనం మూగారు. "ఆ దెయ్యానికి సపోర్టుగా ఈ దిక్కుమాలిన ముండ. ఇంటి ముందు నానా యాగీ

చేసింది. బిడ్డ జైల్లో ఉన్నాడు. బెయిల్ కూడా ఇవ్వనంటున్నారు. ముసలాళ్ళం, మా బ్రతుకేం కాను. మా సంసారం గొడవలు మీకెందుకు, అది కోడలు కాదు, రంకులాడి, విషప్పురుగు. దానికీ లంజల సపోర్టు," ముసలమ్మ కోపంతో అరుస్తుంది. ముసలమ్మ శరీరమంతా రక్తం. వాళ్లిద్దరిని, బయటకు లాక్కు వెళ్ళారు, హోటల్ స్టాఫ్.

బయట చీకటి బాగా చిక్కబడింది. పూర్ణ ముఖంలో, ఒక విధమైన అనీజీ, ఆందోళన. సుందరం, ఆమె వైపే చూస్తున్నాడు. అకాల వర్షమేదో బయట రోడ్డుపై, సన్నటి తుప్పర. గాలికి వాన చినుకులు, అటూ ఇటూ ఊగుతూ, హోటల్ బయట పేవ్‌మెంట్‌పై ముసలి వాళ్లిద్దరూ వానలో తడుస్తూ. ముసలాయన, ముసలమ్మను దగ్గరగా పొదువుకొని, ఆమె చుట్టూ తన శరీరాన్ని కప్పుతూ, కిటికీ అద్దంలోంచి ఆ దృశ్యాన్ని చూస్తుంది పూర్ణ. అమృతా షేర్‌గిల్, 'ది ఓల్డ్ పీపుల్' పెయింటింగ్ గుర్తుకొచ్చింది. బయటకు వెళ్ళి వాళ్ళిద్దరినీ ఆపి, లోపలికి తీసుకొచ్చి, ఏవైనా కబుర్లు చెప్పి, కాఫీ యిప్పించి;

రోడ్డు విశాలమైన లాండ్‌స్కేప్‌లా మారిపోయింది. ముసలి వాళ్ళు, ఒకరినొకరు గాఢంగా హత్తుకొని, దాదాపు రెండు శరీరాలు, ఒకటిగా కలిసిపోయినట్లుగా, వానలో నడుచుకుంటూ వెళ్ళిపోతున్నారు. క్రమంగా లాండ్‌స్కేప్ అదృశ్యం అయింది. రోడ్డుపై సమస్తం అదృశ్యమై, వాళ్ళిద్దరూ మాత్రం, ఒక దృశ్యంగా మిగిలిపోయారు. పూర్ణ ఎదురుగా, కాఫీ కప్పు. నిర్లిప్తంగా చూస్తుంది పూర్ణ కిటికీలోంచి, వాళ్ళిద్దరి వైపే చూస్తూ. సుందరం పూర్ణ ముఖంలో మారే భావోద్వేగాలను చూస్తూ;

ఆ హోటల్, ఒక రంగస్థలిలా ఉంది. ఒక అంకం ముగిసింది. రెండో అంకంలో, అభినయానికి సిద్ధంగా ఉన్న నటుల్లా వాళ్ళిద్దరు.

* * *





కథ పూర్తిచేసి, అందరివైపు చూశాడు ఖదీర్, ముఖ్యంగా శివుడి వైపు. శివుడి ముఖంలో అసంతృప్తి. ''నీ కథకుడి పనితనం ఇందులో కనబడలేదు,'' అని గాఢంగా నిట్టూర్చి, ''ఓకే, నీకింకో ఛాన్సు ఇస్తున్నాను. ఇంకో కథ చెప్పు,'' అన్నాడు.

సుందరం ఉలిక్కిపడ్డాడు. 'వద్దు వద్దు,' అని పెద్దగా అరవాలనిపించింది అతనికి. తన రహస్యగాథలన్నీ, ఇన్నాళ్ళు గుండెల్లో భద్రంగా దాచుకున్నవి, ఖదీర్ నిర్భయంగా, ప్రపంచానికి వెల్లడిస్తున్నాడనిపించింది. ప్రొటెస్టుగా అక్కడి నుంచి వెళ్ళిపోవాలనిపించింది. కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా, ఖదీర్ వైపు తిరిగి, ''భాయ్, ఇంక చాలు,'' అన్నాడు. ఖదీర్ వినిపించుకోనట్లుగా ఇంకో కథను చెప్పడానికి సిద్ధం అయ్యాడు.

## పోతేపోనీ, పోతేపోనీ

జనవరి 6: ఉదయం, ఎమ్మెస్ ఒక అందమైన డైరీ ప్రెజెంట్ చేశాడు. ఇవాళే డైరీ రాద్దామని నిర్ణయించుకొన్నాను. అక్షరాలు బద్ధకంగా డైరీ పేజీలపై పొర్లాడుతున్నాయి. రాయటం ఇప్పుడే నేర్చుకొన్నదానిలా, తప్పులు, కొట్టివేతలూ.

జనవరి 12: ఎప్పుడూ తనే గెలవాలనుకుంటాడు ఎమ్మెస్. అతనో స్పెసిమెన్. ఎంసిపి ఇన్ మేకింగ్.

జనవరి 18: సిటీకి ఇరవై కిలోమీటర్ల అవతల ఈ అపార్ట్‌మెంట్. ఉదయం సీవేజ్ వైపు బ్లాక్ అయ్యింది. నీళ్ళు బాత్‌రూములోంచి బెడ్‌రూమ్‌లోకి వచ్చాయి. భయంకరమైన మురుగువాసన. ఇవేమీ పట్టించుకోకుండా ఎమ్మెస్ స్కూలుకి వెళ్ళిపోయాడు. ఒక్కదాన్నే ఇల్లంతా కడుక్కుంటూ.

సాయంకాలం వస్తూనే, ''టెన్ పాయింట్స్ ఇన్ సపోర్ట్ ఆఫ్ తెలంగాణ మూవ్‌మెంటు,'' అంటూ గిరీశంలా నాకు లెక్చర్ ఇవ్వడం మొదలుపెట్టాడు.

“షటప్,” అని పెద్దగా అరిచి, “బాస్టర్డ్,” అనే మాట నోట్లో అనుకున్నాను.

ఫిబ్రవరి 1: నిద్రపట్టడం లేదు. చీకట్లో సీలింగ్ వైపు, ఫాన్‌వైపు చూస్తూ పడుకున్నాను. గది నిండా దోమలు. చెవుల దగ్గర రొద పెడుతున్నాయి. ఉక్కపోత, బయట గాలిలేదు. వంటగదిలో చప్పుళ్ళు. బహుశా ఎలుక అయ్యుంటుంది. రాత్రిపూట వంటగది దాని అడ్డా.

ఫిబ్రవరి 3: ఎమ్మెస్‌తో మళ్ళీ పోట్లాట. స్కూల్లో గొడవలు. అయిదో తరగతి కుర్రాడి నోట్‌బుక్‌లో లవ్ లెటరు. టాయ్‌లెట్ గోడలపై బూతుబొమ్మలు. “ఏ ఆశా లేదు. సమస్త ధ్వంసం అయిపోతుంది,” అని అరుస్తాడు, “గ్లోబలైజేషన్ కాదు, ఇది మన కోసం తవ్వుతున్న పెద్ద సమాధి,” ఎమ్మెస్ హిస్టీరికల్‌గా మాట్లాడుతున్నాడు. నాకు తలనొప్పిగా ఉంది.

“రుచికరమైన అన్నం తినే యోగం కూడా లేదు. మధ్యాహ్నం నువ్వు బాక్స్‌లో పెట్టిన దోసకాయ కూర చేదుగా ఉంది.”

-దోసకాయలు మినహా మరేదీ కొనలేని పరిస్థితి. కూరగాయలు ముట్టుకుంటే భగ్గుమంటున్నాయి.

-ఇన్‌ఫ్లేషన్ పదహారు శాతానికి వెళ్ళింది. కూరలు తినడం మానేసి, పచ్చిపులుసు, కారపప్పచ్చడి తినాలి.

-ఎకౌంటబులిటీ లేదు. ఇది డెమోక్రసీ కాదు. వల్లకాడు. పొలిటీషియన్లు మనల్ని లంజల్లా చూస్తున్నారు.

“వాగుడు ఆపు, నిద్ర వస్తుంది,” అన్నాను విసుగ్గా. అలిగినట్లున్నాడు. మాట్లాడటం ఆపి, గాఢంగా, పెద్దగా నిట్టూరుస్తూ, నిట్టూరుస్తూ.

ఫిబ్రవరి 24: బట్టలు ఉతికే కార్యక్రమం. చేతులు నీళ్ళలో నాని, నాని మంటలు పుడుతూ; ఉతికిన బట్టల్ని ఆరవేయమంటే పని ఉందని, బయటకు పరుగెత్తాడు. చిరిగి, అసహ్యంగా ఉన్న





ఎమ్మెస్ అండర్‌వేర్‌లు, ముట్టుకోవాలంటే కంపరంగా ఉంది. పుల్లతో ఎత్తి, డస్ట్‌బిన్‌లో వేశాను.

నాప్‌కిన్‌లు అయిపోయాయి. సుందరాన్ని తెమ్మంటే, సిగ్గు పడతాడు. నేనే వెళ్ళాలి. పోయిన వారమే పీరియడ్స్ రావాల్సి ఉంది. పీరియడ్స్ మిస్ కావడం కాదు గదా.

మార్చి 6: మాలతి ఇంటికి వెళ్ళాను. తనకు ఏడో నెల. బాగా భయపడుతుంది. "నాకేమన్నా అయితే..." అంటుంది. డెలివరీ టైంలో చచ్చిపోతే... అంతులేని సందేహాలు మాలతివి.

మార్చి 7: పీరియడ్స్ రాక మూడు వారాలు దాటింది. స్నానం చేస్తున్నప్పుడు పొట్ట ఎత్తుగా కనబడి, ఎమ్మెస్‌కు చెప్పలేదు. కంగారు పడతాడు. ముందు ప్రెగ్నెన్సీ టెస్ట్ చేయించాలి. పాజిటివ్ అయితే అబార్షన్ ప్లాన్ చెయ్యాలి. రెండువేలన్నాక ఆవాలి. దేవుడా, ఎంత కష్టం, ఎంత కష్టం. టు హెల్ విత్ దిస్ బ్లడీ సెక్స్.

మార్చి 28: నిద్రపట్టడం లేదు. దోమలు కుట్టినచోట దద్దుర్లు పేలి, జిలగా ఉంది. పైన సీలింగ్ ఫాన్ తుఫాన్ కాలం నాటి శబ్దం చేస్తుంది. ఏవైనా మంచి సంగతులు గుర్తు చేసుకోవాలి. దిండు కింద కండోమ్‌లు పెడుతూ ఎమ్మెస్. అతనివైపు జాలిగా చూశాను. ఎమ్మెస్‌కింకా సంగతి చెప్పలేదు. పూర్ ఎమ్మెస్, ది ఫాదర్ ఆఫ్ ఏన్ అన్‌వాంటెడ్ ఛైల్డ్.

కొత్త కొత్త కోరికలు కలుగుతున్నాయి. రొయ్యల వేపుడు తినాలనిపిస్తుంది. ఐమాక్స్‌లో త్రిడి సినిమా చూడాలనిపిస్తుంది. వైన్ తాగాలనిపిస్తుంది. ఇలియానా లాగా ఊపుకుంటూ రాంప్‌పై నడవాలనిపిస్తుంది. బ్లాక్‌బెర్రీ ఫోన్‌లో గంటలు గంటలు చాట్ చెయ్యాలనిపిస్తుంది. ఎమ్మెస్‌కి ఎరోటిక్, సెక్స్ ఎసెమ్మెస్‌లు పంపాలనిపిస్తుంది. హఠాత్తుగా తానంతట అదే అబార్షన్ అయితే బాగుండు అనిపిస్తుంది. ప్రస్తుతం పిసరంత నిద్రపడితే బాగుండు అనిపిస్తుంది.

ఏప్రిల్ 2: బ్రేకింగ్ ది న్యూస్. ఎమ్మెస్ ముఖంలో భయం, విస్మయం ఒకేసారి. 'కండోమ్‌లు వాడుతున్నాము కదా, ఎలా జరిగింది,' అని పోలీసువాడిలా ప్రశ్నించటం మొదలుపెట్టాడు. సీక్రెట్ లవర్ ఒకడున్నాడని చెప్పాలనిపించింది. రెండు రోజుల పాటు, పాలి పోయిన ముఖంతో, ఏదో పోగొట్టుకున్నవాడిలా.

పాత పుస్తకాలు, చీరలు అమ్మితే ఆరొందలు, మాలతి దగ్గర అప్పుగా తీసుకున్న వెయ్యి రూపాయలు. అబార్షన్ కోసం ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌కి వెళితే, వెయ్యి రూపాయలు తీసుకొని, టెస్ట్‌లన్నీ చేసి, మరో ఐదువేలు పట్టుకొని రేపు పొద్దున్నే రా, అబార్షన్ చేస్తానంది లేడీ డాక్టరు. ఒళ్ళు మండిపోయింది. 'దొంగలంజా కూతురు లసలే మెసలే ధూర్త లోకం,' అని గట్టిగా తిట్టుకున్నాను.

రాత్రి ఎమ్మెస్ ప్రవక్త ముఖం పెట్టుకు వచ్చాడు. "పోనీలే పిల్లలంటే, మనిద్దరికీ ఇష్టమేగా," అన్నాడు.

నేనేం మాట్లాడలేదు. 'కడుపు సరే, మోస్తాను. ఖర్చు సంగతి, ఎక్కడ బిచ్చమెత్తాలిరా, మగడా,' అనుకున్నాను.

ఏప్రిల్ 13: వరుసగా మూడురోజులు బందు. తగలబడుతున్న బస్సులోంచి కమురు వాసన. ఎమ్మెస్ ఇంట్లోనే ఉన్నాడు. కూర గాయలు లేవు, బియ్యం కూడా. ఆకలి ఎక్కువగా ఉంది. ఎప్పుడూ ఏదైనా నములుతూ ఉండాలనిపిస్తుంది.

వంటగదిలో ఎలుక తచ్చాడుతుంది. డబ్బాలు పడవేసి; దానికీ ఆకలేమో, అదీ నాలా కడుపుతో ఉందేమో.

మధ్య రాత్రి మెలకువ వచ్చింది. అబార్షన్ అయినట్లు కల వచ్చింది.

ఏప్రిల్ 23: మాలతి ఇంటికి వెళ్ళాను. వచ్చే వారమే డెలివరీ అంటున్నారు. ముఖం ఉబ్బుగా ఉంది. కాళ్ళు బెలూన్లలా వాచాయి. డెలివరీ గురించి భయపడుతుంది.





మే 1: నిద్రలో జారి మంచంపై నుంచి కింద పడ్డాను. కాలు బెణికింది.

మే 3: ఎమ్మెస్ దిగులుగా ఉన్నాడు. స్కూల్లో గొడవలు అయ్యాయి. మెమో ఇచ్చారు.

మే 7: ఎమ్మెస్ డిప్రెస్డ్‌గా ఉన్నాడు. తనను సస్పెండ్ చేశారు. రాత్రి ఎమ్మెస్ చాలాసేపు ఏడ్చాడు. అతనట్లా ఏడుస్తుంటే నాకు విసుగ్గా ఉంది. కోపాన్ని ఆపుకొని అతన్ని ఓదార్చాను.

'హమ్ హోంగే కామ్‌యాబ్,' అచ్చం సినిమా హీరోయిన్‌లా, ఎమ్మెస్‌ను గుండెలకు హత్తుకొని, జుట్టు నిమురుతూ, ధైర్యపు మాటలు చెప్పి.

మే 8: నిన్న రాత్రి హాస్పిటల్‌లో మాలతి చచ్చిపోయింది. లోపలి బిడ్డ కూడా చచ్చిపోయింది. పెద్దగా ఏడ్చాను. పొగిలిపొగిలి. అది నా ప్రాణ స్నేహితురాలు. ఎమ్మెస్, ఇక చాలు, ఇక చాలు అంటూ నన్ను బయటకు లాక్కు వచ్చాడు.

"బాస్టర్డ్," అంటూ పెద్దగా అరిచాను. ఎమ్మెస్ భయంగా నావైపు చూశాడు.

మే 29: పెట్రోలు ధరలు మరోసారి పెంచారు. ఎమ్మెస్ తన స్కూటర్ అమ్మేశాడు. భయపెట్టే ఎండలు. నిప్పుల మీద నడిచినట్లు గా ఉంది.

హాస్పిటల్‌కు వెళ్ళాను, చెకింగ్ కోసం. స్కానింగ్ చేద్దాం, బిడ్డ సరిగ్గా పెరుగుతున్నట్లు లేదు, అన్నారు. స్కానింగ్ అవసరం లేదంటూ వచ్చాను.

జూన్ 6: పొడిగా ఉండే వాతావరణం. నల్లని మేఘాలు, ఆకాశంపై మూగి ఉన్నాయి.

ఎమ్మెస్‌ను ఉద్యోగంలోంచి తీసివేశారు. కోర్టుకు వెళతానంటు న్నాడు. మిగిలిన ఒంటరి బంగారుగొలుసును తాకట్టు పెట్టాడు. ఆకలి ఆకలిగా ఉంటుంది. తినడానికేం లేదు.

జూన్ 22: నాలుగు పావురాలు తెచ్చాడు ఎమ్మెస్, ముందు గదిలో ఉంచి, వాటి ముందు గింజలు చల్లి; పావురాలు, ఎలుకల మాంసం నాకు సహించదు అన్నాను. వెర్రిగా చూశాడు ఎమ్మెస్.

పక్క అపార్టుమెంటు వాళ్ళు చికెన్ కర్రీ పంపారు. మొహమాట పడకుండా అంతా నేనే తిన్నాను.

జూన్ 25: మాలతి కలలోకి వచ్చింది. బంద్ మధ్యలో పోలీసులు తరుముతున్నట్లు కూడా కల వచ్చింది. తుపాకీ బాయ్‌నెట్ నా వెన్నులో దిగబడినట్లు; రోడ్డు మధ్యలో నా శవం. ముక్కు, కళ్ళు, చెవులు లేని శిశువు నా శవం చుట్టూ పారాడుతున్నట్లు.

జూన్ 30: నిద్రలో పెద్దగా ఏడుస్తున్నాడు ఎమ్మెస్. నిద్ర లేపి, ఏమైందని అడిగాను. మనం చనిపోయినట్లు కల వచ్చింది. గదిలో మన శవాలు కుళ్ళుతూ... గట్టిగా నిట్టూర్చాను.

జులై 3: ఎమ్మెస్ మరోసారి నాపై చెయ్యి చేసుకున్నాడు. రోజూ తాగుతున్నాడు.

జులై 26: ఆకలి. ఆకలి. ఇల్లంతా ఆకలివాసన వేస్తుంది. (మాతో పాటు ఎలుక కూడా వంటగదిలో ఆకలితో తిరుగుతుంది.) గుప్పెడు బియ్యం కూడా లేవు.

ఆగస్టు 4: కుళ్ళిపోయిన కూరగాయలతో సూప్ చేసుకొని తాగాను. ఆకలి తీరిందిగాని కడుపులో తిప్పుతూ, వాంతులు, విరోచనాలు.

ఆగస్టు 30: కడుపులో బిడ్డ కదులుతున్నట్లుగా ఉంది. లోపలే చనిపోతే బాగుండు అనే కోరిక పదే పదే కలుగుతుంది.

సెప్టెంబరు 13: నాకు ఉద్యోగం దొరికింది. సేల్స్‌గర్ల్‌గా. రోజుకు పన్నెండు గంటల పని.

అడ్వాన్స్ అడిగి, బియ్యం కూరగాయలు తెచ్చుకొని, చాలా రోజుల తరువాత తృప్తిగా అన్నం తిన్నాను.





సెప్టెంబరు 14: ఇవాళ సెలవు. పన్నెండుదాకా నిద్రపోయాను. ఎమ్మెస్ ఇంటికి విస్కీ బాటిల్ తెచ్చుకున్నాడు. ముందు గదిలో ఒక్కడే, ఏవేవో మాట్లాడుకుంటూ. అర్ధరాత్రి నిద్ర లేపాడు. ఎమ్మెస్ కళ్ళు నిప్పు చితుకుల్లా. దగ్గరకు చేరాడు. ''ప్రెగ్నెన్సీ, ఎడ్వాన్స్‌డ్ స్టేజిలో ఉంది,'' వద్దన్నాను. వినిపించుకోలేదు. క్రూర మృగం దాడి చేసినట్లుగా. శరీరమంతా పుండులా మారింది. రాత్రంతా జండూబామ్ రాసుకుంటూ గడిపాను. వేకువజామున నా దగ్గరకు వచ్చి, ''నేను పాపిని, నేను క్రిమినల్‌ని,'' అంటూ నా పాదాలు పట్టుకొని ఏడ్చాడు.

ఇల్లంతా విస్కీవాసన. వేకువజామున పెద్దగా వాంతి అయ్యింది. ఉదయానికి జ్వరం.

సెప్టెంబరు 20: ''శిశువు చిత్రనిద్రలో ప్రాచీన స్మృతులూచే చప్పుడు'' బ్లా... బ్లా... ఎవడో మహాకవి రాశాడంటూ ఎమ్మెస్.

ఇది నరకం. ఇది హింస. వద్దంటున్నా తోసుకు వస్తున్న శిశువు. గో అవే, గో అవే మై చైల్డ్. దిసీజ్ నాట్ ది టైం ఫర్ యు...

ఇది నా డైరీలో చివరి పేజీ. సంవత్సరం పూర్తి కాకుండానే, ఇవాళే దీన్ని చింపి ముక్కలు చెయ్యాలని నిర్ణయించుకున్నాను. హింసను గుర్తుకు తెచ్చే ఈ డైరీ, పదేపదే తిరగవేయటం నాకిష్టం లేదు. ఎమ్మెస్ చెప్పిన కవితతో డైరీ ముగిస్తాను.

''పోతేపోనీ, పోతేపోనీ, సతుల్ సుతుల్...''

* * *

ఖదీర్ రెండో కథ పూర్తి అయ్యింది. అందరూ శివుడి వైపు ఆసక్తిగా చూశారు. ఖదీర్ ముఖంలో వింత ప్రశాంతత.

శివుడు, ఖదీర్ కథల గురించి ఏం మాట్లాడలేదు. ''ఒక గొప్ప కథ, నైజీరియన్ రైటర్ గూగీవా డియాంకో రాసిన కథ చెప్తాను, వినండి. గొప్ప కథలు, ఎట్లా అన్ని కాలాలకు రిలేట్ అవుతాయో తెలుస్తుంది,'' అన్నాడు.

సుందరం సెల్‌ఫోన్ మోగింది. వెంటవెంటనే మూడుసార్లు. పూర్ణ దగ్గర నుంచి. కంగారుగా లేచాడు సుందరం. బహుశా నొప్పులు మొదలై ఉంటాయి.

"హలో," అన్నాడు సుందరం. అటువైపు నుంచి వినబడీ వినబడనట్లుగా, పూర్ణ స్వరం. ఆయాసపడుతున్నట్లుగా, "నారాయణగూడా, తాజ్‌మహల్ హోటల్ దగ్గర..." అంది. "అక్కడ ఏ హాస్పిటల్, ఎటు," సుందరం ఆతృతగా అడిగాడు. అప్పటికే పూర్ణ ఫోన్ పెట్టేసింది. కంగారుగా లేచాడు సుందరం. "అంతా ఓకే అవుతుంది. ఆల్ ది బెస్ట్," అన్నాడు శివుడు. బయటదాకా వచ్చాడు ఖదీర్. గిఫ్ట్ పాకెట్ నొకదాన్ని సుందరం చేతిలో పెట్టి, "ఈ పుస్తకం దీదీకి ఇవ్వు. ఖుదా హాఫీజ్," అంటూ సాగనంపాడు.

నారాయణగూడా తాజ్‌మహల్ హోటల్ చుట్టుపక్కల వీధులన్నీ వెతికాడు సుందరం. ఆ చుట్టుపక్కల నర్సింగ్‌హోంలేవీ లేవు. పూర్ణకు ఫోన్ చేశాడు. "హోటల్ లోపలికి రా," అంది. కంగారుగా వెళ్ళాడు సుందరం.

రెస్టారెంట్‌లో ఒక మూలన పూర్ణ ఒక్కతే కూర్చుని ఉంది. ఎదురుగా కాఫీ కప్పు. "వాన కాస్త తగ్గింది. వాతావరణం చల్లగా, హాయిగా ఉంది. కాఫీ తాగాలనిపించి... ఈ టెన్షన్‌లు, భయాలు ఎప్పుడూ ఉండేవే కదా, కాసేపు వాటిని మరిచిపోదామనిపించింది. కాఫీ తాగుతూ, వానాకాలపు సాయంకాలాన్ని ఎంజాయ్ చేస్తూ..."

సుందరం పూర్ణవైపు కోపంగా చూశాడు.

మనోహరంగా నవ్వింది పూర్ణ. "ఈ కిటికీ పక్కన కూర్చుని, రోడ్డు వైపు చూస్తూ, కాఫీ తాగటం థ్రిల్‌గా ఉంటుంది. లెటజ్ ఎంజాయ్ ది కాఫీ," అంది.

కిటికీ పక్కన టేబుల్ పై ఎదురెదురుగా వాళ్ళిద్దరూ. వాళ్ళ ముందు కాపీ కప్పులు. తడిసిన రోడ్డు, రోడ్డుపై తళుక్కుమంటున్న వెలుగులు.





సుందరం చేతిలోని గిఫ్ట్‌పాక్ విప్పాడు. “ఏమిటది,” అని అడిగింది పూర్ణ.

“ఖదీర్ ఇచ్చాడు,” అంటూ గిఫ్ట్ పాక్ విప్పాడు. పుస్తకం. ‘ది లవ్ స్టోరీస్ ఆఫ్ పూర్ణ, సుందరం- మహమ్మద్ ఖధీర్’ సుందరం ముఖం పాలిపోయింది. “ఏదీ నన్ను చూడనీ,” అంటూ పుస్తకాన్ని లాక్కోబోయింది పూర్ణ.

పూర్ణ నుంచి, ఆ పుస్తకాన్ని దాచాలని ప్రయత్నిస్తున్నాడు సుందరం.

మోళీ కట్టో, మంత్రం వేసో, ఆ పుస్తకాన్ని పూర్ణ చూడకుండా ఆపాలనుకున్నాడు సుందరం.

*ఆదివారం వార్త, 29 మే 2011*